గవర్నర్‌ను కలిసిన వైవీయూ విసి

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌ను యోగి వేమన విశ్వవిద్యాలయం విసి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ విజయవాడలోని లోక్ భవన్‌లో కలిశారు. విశ్వవిద్యాలయ విసిగా బాధ్యతలు స్వీకరించాక వైవీయూ విసి, రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలిసి మొక్కను అందజేసి శాలువాతో సత్కరించారు. వేమన విశ్వవిద్యాలయం 11, 12,13, 14వ కాన్వకేషన్ నిర్వహణ కోసం అనుమతి ఇవ్వాలని, అలానే కులపతి హోదాలో హాజరుకావాలని ఆహ్వానించారు. అందుకు గవర్నర్ సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా వైవీయూ ప్రగతి గురించి విసి గవర్నర్‌కు వివరించారు.

గవర్నర్‌కు పూల మొక్కను ఇస్తున్న విసి రాజశేఖర్

స్వయం ఉపాధికి మోక్షమెప్పుడో?

రూ.54.47 కోట్ల రుణాలకు బ్రేక్

జిల్లాలో 2,245 యూనిట్ల నిరీక్షణ

ఫైనాన్స్‌లో బిఆర్‌ఒ పెండింగ్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో స్వయం ఉపాధి రుణాలకు మోక్షమెప్పుడో తెలియడం లేదు. ప్రభుత్వం 2025 జనవరిలో జిల్లాలోని తొమ్మిది సామాజిక తరగతులకు 2,245 యూనిట్లను మంజూరు చేసింది. మొదటి వరుసలో రూ.48.63 కోట్లు విడుదలకు అంగీకరించింది. మొదటి విడతలో ఎంపిక కాని వారికి మరో రూ.5.84 కోట్లు వెరసి 54.47 కోట్లు అందజేయనుంది. బిసి కార్పొరేషన్ అధికార యంత్రాంగం ఆయా మండలాల వారీగా లక్ష్యాలను నిర్దేశిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఉన్నఫళంగా నిధుల విడుదలకు బిఆర్‌ఒను విడుదల చేసింది. రాష్ట్ర ఫైనాన్స్ డిపార్టుమెంట్ పెండింగ్‌లో పెట్టడంతో దరఖాస్తుదారుల్లో అసహనం పెల్లుబికుతోంది.

జిల్లాలో గత ఫిబ్రవరిలో రూ.54.47 కోట్లతో బిసి, ఇబిసి సామాజిక తరగతులకు చెందిన యువతకు 2,172 యూనిట్ల మేరకు సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ సదుపాయం కల్పించాలని నిర్ణయించింది. రుణాల మంజూరుకు నిధుల విడుదలకు సంబంధించిన కసరత్తు పూర్తి చేసింది. బిసి, ఎస్‌సి, ఎస్‌టి, కాపు తదితర కార్పొరేషన్ల ద్వారా రుణాలు బిసి కార్పొరేషన్ యూనిట్లు 1,550, ఇబిసి యూనిట్లు 74, కమ్మ కార్పొరేషన్ యూనిట్లు 27, రెడ్డి కార్పొరేషన్ యూనిట్లు 98, ఆర్యవైశ్య రుణ యూనిట్లు 17, క్షత్రియ కార్పొరేషన్ యూనిట్లు 16, బ్రహ్మణ కార్పొరేషన్ 08, కాపు కార్పొరే షన్ యూనిట్లు 379, కాపు ఎంఎస్‌ఎంఇ గ్రూపు రుణాలు 3 చొప్పున యూనిట్లు ఉన్న సంగతి తెలిసిందే. ఒక్కో యూనిట్ రూ.ఐదు లక్షలు, ఇబిసి యూనిట్ రూ.8 లక్షల చొప్పున కేటాయించింది. ఆయా యూనిట్లకు కేటాయించిన రూ.4.8 కోట్లలో రూ.2.39 కోట్ల సబ్సిడీ లభించనుంది. ఇబిసి రుణాలు, ఇతర తరగతుల కింద అర్హులైన వారికి యూనిట్‌కు రూ.ఎనిమిది లక్షల చొప్పున అందించనున్నట్లు తెలిపింది. ఇతర తరగతుల వారికి 73 యూనిట్లను సైతం మంజూరు చేసింది. రూ.4.8 కోట్లలో రూ.2.92 కోట్లు సబ్సిడీ లభించనున్నట్లు తెలిపింది..

ఫైనాన్స్‌లో బిఆర్‌ఒ పెండింగ్

స్వయం ఉపాధి రుణ యూనిట్ల మంజూరుకు బ్రేక్ పడింది. ప్రభుత్వం రూ.54.47 కోట్ల స్వయం ఉపాధి రుణాలకు నిధులు విడుదల చేస్తూ బిఆర్‌ఒను సైతం విడుదల చేసింది. బడ్జెట్ రిలీజ్ ఆర్డర్ ఫైనాన్స్ డిపార్టుమెంట్‌కు పంపించి నట్లు సమాచారం. ఉన్నఫళంగా రుణాల మంజూరు ప్రక్రియను నిలిపేసింది. బిసి, ఇతర సామాజిక తరగతులకు స్వయం ఉపాధి రుణాల మంజూరుకు మంత్రివర్గ కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ ఎటువంటి సిఫారసులు చేయకుండా నిమ్మనుస్తావస్థలో ఉండడం నిరుద్యోగుల్లో ఆందోళన కలిగిస్తోంది.

స్వయం ఉపాధి రుణాలు లేనట్లే!

జిల్లాలో 2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి స్వయం ఉపాధి రుణాలు లేనట్లేనని తెలుస్తోంది. 2025 అకడమిక్ ఇయర్ ముగింపు దశకు చేరుకుంది. 2026 ఆర్థిక సంవత్సరంలో వరుసగా మున్సిపల్, కార్పొరేషన్, పంచాయతీ, జిల్లా పరిషత్ ఎన్నికలు రానున్న నేపథ్యంలో 2026 జనవరి నెలాఖరు నాటికి ఫైనాన్స్ క్లియరెన్స్ రావాల్సి ఉంది. లేనిపక్షంలో 2026 జూన్, సెప్టెంబర్ మాసాల మధ్య స్వయం ఉపాధి రుణాల మంజూరుకు అవకాశాలు ఉన్నాయనే అంచనాలు వినిపిస్తున్నాయి.

జిల్లా చరిత్రను దేశం నలుమూలల చాటేలా

గండికోట ఉత్సవాలు

- 11 నుంచి 13 వరకు అంగరంగ వైభవంగా నిర్వహణ
- నిర్వహణకు సర్వం సన్నద్ధం
- కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

నిర్వహణ ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

ప్రజాశక్తి- జమ్మలమడుగు

జిల్లా చరిత్ర దేశం నలుమూలలా చాటేలా గండికోట ఉత్సవాలను ఈ నెల 11, 12, 13వ తేదీలలో పర్యాటకశాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్నామని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. గండికోట ఉత్సవాల నిర్వహణకు ముందస్తు ప్రణాళికతో సన్నద్ధం కావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం జమ్మలమడుగు నియోజకవర్గం గండికోలో ఉత్సవాల నిర్వహణ, సాస్కి పర్యాటక అభివృద్ధి పనులను పరిశీలించారు. ఉత్సవాలకు సంబంధించి సభా వేదిక, స్టాల్స్ ఏర్పాటు, పార్కింగ్, ఇతర సంబంధిత అంశాలపై ఆరాతీశారు. గండి కోట ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు తయారు చేసిన కార్యాచరణ ప్రణాళిక మేరకు చేయవలసిన ఏర్పాటు పై దిశా నిర్దేశం చేశారు. ఉత్సవాలను జిల్లా పర్యాటక, చారిత్రక, సాంస్కృతిక వైభవాన్ని దేశం నలు దిక్కులా చాటేలా విస్తరింప జేసేలా కొన్ని ప్రధానమైన పనులను త్వరితగతిన పూర్తిచేస్తున్నాని చెప్పారు. ఉత్సవాలకు మునుపే పూర్తి కావాల్సిన పలుముఖ్యమైన పనులను పరిశీలించారు. ఎంట్రన్స్, వెలివేషన్, పార్కింగ్, అమినిటీ భవనం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎపిటిడిసి ఇంజినీర్లు, ప్రాజెక్ట్ కన్సల్టెంట్‌లను ఆదేశించారు. గండికోట ప్రాంతాన్ని సాస్కీ పథకం ద్వారా రూ.79 కోట్లతో అభివృద్ధి చేసి అద్భుతమైన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందని చెప్పారు. అందులో భాగంగానే పర్యాటకులు బస చేసేలా స్టార్ హోటళ్లు, ఇతర ఆకర్షణీయమైన నిర్మాణాలు చేపడుతున్నారని చెప్పారు. పర్యాటకులకు సంతృప్తి కరమైన అనుభూతిని అందించేందుకు 10 వేల ఎస్‌ఎఫ్‌టి విస్తీర్ణంలో టూరిస్టు ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను, 4 వలే ఎస్‌ఎఫ్‌టి విస్తీర్ణంలో రెండు అమినిటీస్, ఇన్‌ఫర్మేషన్ సెంటర్లను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఒక టెంట్ సిటీ, 1.5 కిలో మీటరు మేరా గండికోట ఫోర్టు నుండి విజిటర్స్ సెంటర్ వరకు వాకింట్ ట్రెయల్‌ను నిర్మిస్తున్నారన్నారు. ఈ మార్గం మొత్తం కూడా వెహికల్ ఫ్రీ జోన్‌గా కేటాయించి ఆ మార్గానికి ఇరువైపులా పర్యాటకులు చక్కటి ఆహ్లాదకరమైన అనుభూతిని పొందేలా పలు ప్రత్యేక నిర్మాణాలను ఏర్పాటు చేయనున్నామని వివరించారు. గండికోట కొట్టాలపల్లె నుండి గండికోట రిజర్వాయర్, డ్యామ్ అందాలను వీక్షించడంతో పాటు, ఆ మార్గాన్ని కలిపే అనుకూలతలను, గండికోట గార్జ్ వ్యూ పాయింట్ ను పరిశీలించారు. **మైలవరం జలాశయం పరిశీలన..** ఈ క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా కలెక్టర్ మైలవరం జలాశయాన్ని నీటినిలువ సామర్థ్యాన్ని పరిశీలించారు. ఈ క్షేత్రస్థాయి పర్యటనలో జిలా టిడిపి అధ్యక్షులు భూపేష్ రెడ్డి, జిల్లా టూరిజం అధికారి సురేష్‌కుమార్, జమ్మలమడుగు ఆర్‌డిఒ సాయి శ్రీ, డిఆర్‌డిఎ, డ్వామా, మెప్మా పీడీ ఆదిశేషా రెడ్డి, రాజ్యలక్ష్మి, కిరణ్ కుమార్, ఆర్ అండ్ బి ఎస్ఈ చంద్ర శేఖర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు..

క్రీడలతో మానసిక, శారీరక దృఢత్వం : ఎస్‌పి

- జిల్లా వార్షిక పోలీస్ స్పోర్ట్స్, గేమ్స్ మీట్ పోటీలు ప్రారంభం

క్రీడా జ్యోతిని వెలిగించి గేమ్స్ మీట్‌ను ప్రారంభిస్తున్న ఎస్‌పి

ప్రజాశక్తి - కడప అర్బన్

క్రీడలతో మానసిక, శారీరక దృఢత్వం పెంపొందుతుందని ఎస్‌పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని పోలీస్ పరేడ్ మైదానంలో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వార్షిక పోలీస్ స్పోర్ట్స్, గేమ్స్ మీట్ పోటీలు-2025ను ఎస్‌పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ ప్రారంభించారు. ప్రారంభ సూచకంగా బెలూన్లు, కపోతాలను ఎగురవేశారు. జిల్లాకు చెందిన జాతీయ స్థాయి హాకీ క్రీడాకారులు, ఎ.ఆర్ హెడ్ కానిస్టేబుళ్ల ఎం.ఎస్ విజయభాస్కర్, విజయ్ కుమార్, ఫుట్‌బాల్ క్రీడాకారుడు జి.రాజశేఖర్ ఎస్‌పి క్రీడా జ్యోతిని అందించారు. క్రీడాజ్యోతిని వెలిగించి స్పోర్ట్స్, గేమ్స్ మీట్‌ను ప్రారంభించారు. ముందుగా పోటీల్లో పాల్గొనే సబ్ డివిజన్‌లకు చెందిన పోలీసు క్రీడాకారుల మార్చ్ పాస్ట్‌ను ఎస్‌పి తిలకించి గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ సిబ్బందిలో క్రీడా ప్రతిభను వెలికితీయడానికి 'పోలీస్ స్పోర్ట్స్ మీట్' ఎంతో దోహదపడుతుందన్నారు. క్రీడా స్ఫూర్తితో ఆటల్లో పాల్గొనాలని, గెలుపోటములు ముఖ్యం కాదని తెలిపారు. నిరంతరం విధి నిర్వహణలో ఉండే పోలీస్ సిబ్బందికి ఈ క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు వారిలో ఉన్న క్రీడాప్రతిభకు గుర్తింపు వస్తుందన్నారు. క్రమశిక్షణ, పోలీస్ సిబ్బంది మధ్య మరింత సమన్వయం పెంపొందేందుకు ఈ క్రీడలు దోహదపడతాయన్నారు. వరుసగా మూడు రోజులు పాటు సాగే ఈ స్పోర్ట్స్ మీట్‌లో 6 పోలీస్ సబ్ డివిజన్లకు సంబంధించిన టీమ్‌లు కబడ్డీ, వాలీబాల్, పుట్ బాల్, అథ్లెటిక్స్, 100 మీటర్లు, 400 మీటర్లు, 800 మీటర్ల పరుగుపందెం, హైజంప్, లాంగ్ జంప్, క్రికెట్, షటిల్ మొదలగు క్రీడలలో పాల్గొంటారని అన్నారు. లీగ్ మ్యాచులలో విజేతలుగా నిలిచిన వారు ఫైనల్స్‌లో తలపడనున్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి(అడ్మిన్) కె.ప్రకాష్ బాబు, ఎ.ఆర్ అదనపు ఎస్.పి బి.రమణయ్య, డిఎస్‌పిలు ఎన్.సుధాకర్, ఎ.వెంకటేశ్వర్లు, భావన, కె.వెంకటేశ్వరరావు, డిఎస్‌పి జి. రాజేంద్ర ప్రసాద్, బి.మురళి, ఆర్ఐ లు శివరాముడు, శ్రీశైల రెడ్డి, టైటస్, సోమశేఖర్ నాయక్, నగరంలోని సిఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, పోలీసు సిబ్బంది, పిఇటి మాస్టర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిసిసి అధ్యక్షులు ఎన్.డి.విజయజ్యోతి

ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడిస్తే

చూస్తూ ఊరుకోం : డిసిసి

ప్రజాశక్తి - కడప

పేదరిక నిర్మూలన కోసం 2006లో కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే విధంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్రలు పన్నుతుందని డిసిసి అధ్యక్షులు ఎన్. డి. విజయ జ్యోతి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి చట్టాన్ని పాత పద్ధతిలోని కొనసాగించాలని అన్నారు. లేనిపక్షంలో పోరాటం కాంగ్రెస్ పార్టీ సాగిస్తుందని హెచ్చరించారు. శనివారం కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా పూలే చేసిన సేవలను గుర్తు చేసి కొనియాడారు. బిజెపి చర్యలను వ్యతిరేకిస్తూ ఈనెల 5 నుండి ప్రజల్లోకి వెళ్ళనున్నట్లు తెలిపారు. 2006 ఫిబ్రవరి 2న మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్, సోనియా గాంధీ, వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి నేతృత్వంలో అనంతపురంలో ఉపాధి హామీ చట్టాన్ని మొట్టమొదటిసారిగా ప్రవేశపెట్టి అమలు చేశారని గుర్తుచేశారు. ఇప్పుడు చేసే చట్టంలో కేంద్రం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం అని చేయడం చాలా దారుణం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు 40 శాతం నిధులు కాలక్రమేనా అందించలేవని, అందువల్ల ఈ పథకాన్ని నిర్వీర్యం చేయాలని బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని అన్నారు. ఈనెల 5 నుండి పిసిసి అధ్యక్షులు వై.ఎస్. షర్మిల రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి నియోజకవర్గంలో, ప్రతి మండలంలో, ప్రతి గ్రామంలో జిరామ్ జి చట్టం తీసుకురాకుండా పోరాటం చేస్తామన్నారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌస్ పీర్, కమలాపురం నియోజవర్గ ఇన్‌ఛార్జి అశోక్ కుమార్ రెడ్డి, ప్రొద్దుటూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఇరాన్‌బాషా, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సుశీల్ కుమార్, ఎన్‌ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు మామిళ్ల బాబు, సిద్ధిక్ పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి : జడ్జి

ప్రజాశక్తి - కడప

భోజనాన్ని పరిశీలిస్తున్న జడ్జి

ఖైదీల ఆరోగ్య విషయాల పట్ల ఎప్పటికప్పుడూ తగు జాగ్రత్తలు తీసుకో వాలని సీని యర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రు ద్దీన్ సూచించారు. శనివారం ఆయన కడప పురుషుల, ప్రత్యేక మహిళా కారాగారాలను, ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను సందర్శించారు. ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సాయం సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనంతరం జైలు పరిసరాలను పరిశీలించి తగు సూచనలను, సలహాలను ఇచ్చారు. లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతను తెలియజేశారు. లీగల్‌ఎయిడ్ బాక్సులను పరిశీలించారు. జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సాయం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం, మానసిక వ్యాధులతో బాధపడే ఖైదీల ఆరోగ్య విషయాల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సకాలంలో మందులను వాడాలని తెలియజేశారు, వైద్యాధికారికి తగు సూచనలు ఇచ్చారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100పై ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పురుషుల, ప్రత్యేక మహిళ కారాగారాల సూపరింటెండెంట్లు, న్యాయవాదులు, వాలంటరీలు, ఖైదీలు పాల్గొన్నారు.

'మెడికవర్'లో కేన్సర్ అత్యాధునిక వైద్య చికిత్సలు

- ప్రముఖ సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ ఎం.రమేష్ బాబు

ప్రజాశక్తి - కడప అర్బన్

రమేష్‌బాబును ఆహ్వానిస్తున్న సురేంద్రబాబు

కేన్సర్‌కు నెల్లూరులోని మెడికవర్ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో అత్యాధునిక వైద్య చికిత్సలు అందు బాటులోఉన్నాయని ప్రముఖ కన్సల్టెంట్ సర్జికల్ ఆంకాలజిస్ట్, హైపెక్ సర్జన్ డాక్టర్ ఎం.రమేష్ బాబు అన్నారు. శనివారం కడప నగరంలోని తిరుమల హాస్పిటల్స్‌లో కేన్సర్ వ్యాధుల చికిత్స కోసం కన్సల్టేషన్ నిర్వహించారు. తొలిసారి తిరుమల హాస్పిటల్స్‌కి విచ్చేసిన డాక్టర్ రమేష్ బాబుకు ఆస్పత్రి చైర్మన్, ప్రముఖ ఇఎన్‌టి వైద్య నిపుణులు డాక్టర్ పి.సురేంద్ర బాబు పూల కుండి అందజేసి స్వాగతం పలికారు. వైద్య శిబిరానికి విచ్చేసిన వారిని డాక్టర్ పరీక్షించి వారికి తగు వైద్య సలహాలు, సూచనలు అందజేశారు. 16 మంది కేన్సర్ బాధితులు డాక్టర్‌ను చికిత్స నిమిత్తం సంప్రదించారు. వారందరిని ఓపిగ్గా పరీక్షించి వారి సందేహాలను నివృత్తి చేశారు. డాక్టర్ రమేష్ బాబు మాట్లాడుతూ ప్రతినెల 1వ శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కడప నగరంలోని తిరుమల హాస్పిటల్‌లో తాను అందుబాటులో ఉంటానని తెలిపారు. కేన్సర్ వ్యాధులతో బాధపడుతున్న వారు తనను సంప్రదించి నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలను పొందవచ్చని చెప్పారు. డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకం, ఇహెచ్‌ఎస్ పథకం ద్వారా అన్ని రకాల కేన్సర్ జబ్బులకు మెడికవర్ హాస్పిటల్స్‌లో ఉచిత వైద్యం అందజేస్తామని వివరించారు. అపాయింట్మెంట్ కోసం 8977732046, 8639810322 లలో సంప్రదించాలని కోరారు. శిబిరంలో తిరుమల హాస్పిటల్స్ పరిపాలన అధికారి మంచాల తేజ, తిరుమల హాస్పిటల్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ నిజాయితీ

- బంగారు, వెండి నగలతో ఉన్న బ్యాగ్ మహిళకు అప్పగింత

ప్రజాశక్తి - కడప అర్బన్

మహిళకు బ్యాగ్‌ను అప్పగిస్తున్న పోలీసులు

రూ.4 లక్షల విలువైన బం గారు, వెండి ఆభరణాలతో కూడిన హ్యాండ్ బ్యాగ్‌ను బాధిత మహిళకు అప్పగించి తన నిజా యితీని నిరూ పించుకు న్నారు నగరానికి చెందిన ఆటో డ్రైవర్ వివరాలు.. కడప నగరంలోని ప్రకాష్ నగర్‌కు చెందిన కొమ్మునూరి మానస అనే మహిళ బద్వేలుకు వెళ్లి ఈనెల 2న రాత్రి 7.30 గంటలకు కడపకు వచ్చారు. కడప బస్టాండ్ వద్ద నుంచి తన పిల్లలతోపాటు ఆటోలో ఇంటికి చేరుకున్నారు. లగేజ్ బ్యాగులు తీసుకుని తన హ్యాండ్ బ్యాగ్‌ను మరిచి పోయారు. చిన్నచౌక్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా వెంటనే చిన్నచౌక్ పోలీసు స్పందించి సిసి కెమెరాలు చెక్ చేసి ఆటోను గుర్తించారు. వైవీ స్ట్రీట్‌కు చెందిన ఆటో డ్రైవర్ ఖాజామోహిద్దీన్‌ను స్టేషన్‌కు పిలిపించారు. ఆటోలో వెనుక వైపు అలాగే ఉండిన హ్యాండ్ బ్యాగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. అందులో 50 గ్రాములు బరువు గల బంగారం, సుమారు 100 గ్రాములు బరువు గల వెండి ఆభరణాలున్నాయి. వాటి విలువ సుమారు రూ.4 లక్షలు ఉంటుంది. చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ సిఐ ఓబులేసు, ఎస్ఐ రాజరాజేశ్వర రెడ్డి, రవికు మార్ భాదితురాలికి అప్పగించారు. ఆటోడ్రైవర్ ఖాజా మొయిద్దీన్ నిజాయితీని ప్రశంసించి రూ.500 నగదు బహుమతి అందజేశారు.

పాలిటెక్నిక్‌లో ప్రవేశం

ప్రజాశక్తి -కడప అర్బన్

ఐటిఐ రెండేళ్ల కోర్సులో 60 శాతం మార్కులతో పాసైన అభ్యర్థులు పాలిటెక్నిక్ రెండవ సంవత్సరంలో ప్రవేశం పొందేందుకు అర్హులని ప్రభుత్వ మైనార్టీ ఐటిఐ ప్రిన్సిపల్ జ్ఞానకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పాలిటెక్నిక్ బోర్డు వారు నిర్వహించే ప్రవేశ పరీక్షలు రాయాలన్నారు. అర్హత సాధించిన వారు ఈనెల ఐదు నుంచి ఫిబ్రవరి 4 నిర్వహించే తరగతులకు హాజరు కావచ్చని పేర్కొన్నారు.

కాంగ్రెస్ పార్టీ

నగర అధ్యక్షులుగా సయ్యద్ గౌస్‌పీర్

ప్రజాశక్తి - కడపఅర్బన్

కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులుగా సయ్యద్ గౌస్‌పీర్‌ను నియమించారు. శనివారం ఎఐసిసి జనరల్ సెక్ర టరీ కె.సి.వేణుగోపాల్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా అధ్యక్షులు, నగర అధ్యక్షులను నియమించారు. కాంగ్రెస్ పార్టీలో చురుకుగా ఉంటూ, తనదైన ముద్ర వేసుకున్న సయ్యద్ గౌస్‌పీర్‌ను నగర అధ్యక్షులుగా నియమించడం పట్ల పలువురు నాయకులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ, జనరల్ సెక్రటరీ కె.సి.వేణుగోపాల్, పిసిసి అధ్యక్షులు వై.ఎస్.షర్మిలా, జిల్లా అధ్యక్షులు ఎన్.డి.విజయజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గౌస్‌పీర్ మాట్లాడుతూ పార్టీ తనపై పెట్టిన బాధ్యతను సంపూర్ణంగా నిర్వర్తిస్తానని పేర్కొన్నారు. పేద, బడుగు, బలహీన, మైనార్టీ వర్గాల పక్షాన నిలబడి పోరాడతానని చెప్పారు. నగర అధ్యక్ష పదవి తన బాధ్యతలను మరింత పెంచాయని తెలిపారు. వచ్చే కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా ముందుకు వెళతామని పేర్కొన్నారు. ఢిల్లీ పెద్దలు గత డిసెంబరులో కడపకు ప్రత్యేక కమిటీని పంపించారని చెప్పారు. వారి నివేదిక ఆధారంగా తనను నగర అధ్యక్షులుగా నియమించారన్నారు. పార్టీ కార్యక్రమాలను నిర్విరామమంగా నిర్వహించామని పేర్కొన్నారు. డిసిసి అధ్యక్షులుగా మరో మారు ఎన్నికైన ఎన్.డి.విజయజ్యోతికి శుభాకాంక్షలు తెలిపారు.

మోదం..ఖేదం

ప్రజాదృష్టి

జిల్లాల పునర్విభజన కొందరిలో మోదం..మరికొందరిలో ఖేదాన్ని నింపింది. మదనపల్లి కలెక్టర్ కార్యాలయ ప్రారంభోత్సవంలో ఎటువంటి సందడి వాతావరణం కనిపించలేదు. రాయచోటిలో నూతన సంవత్సర వేడుకల వాతావరణ ఆనవాళ్ల జాడే కనిపించలేదు. జిల్లాల పునర్విభజనలో అన్నమయ్య జిల్లా అస్థిత్వమే గల్లంతు కావడం తటస్తులను, మేధావులను సైతం నిర్ఘాంతపరిచింది. అన్నమయ్య జిల్లాకు చెందిన రైల్వేకోడూరు నియోజకవర్గాన్ని తిరుపతి జిల్లాలో కలపాలని నిరసనలు, ఉద్యమాలు చేసిన దాఖలా ల్లేవు. రైల్వేకోడూరు నియోజకవర్గాన్ని తిరుపతి జిల్లాలో కలపడమేమిటో తెలియడం లేదు. రాష్ట్రంలోని పార్లమెంట్ కేంద్రాలను జిల్లా కేంద్రాలుగా ఏర్పాటు చేస్తామని వైసిపి అధ్యక్షులు వైఎస్.జగన్ ఇచ్చిన హామీని ఉల్లంఘించి రాజంపేట వాసులను తీవ్ర నిరాదరణకు గురిచేసిన సంగతి తెలిసిందే. 2024 సార్వత్రిక ఎన్నికలు రానే వచ్చాయి. ఎన్నికల్లో శృంగభంగం తప్పలేదు. అనంతరం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి నాయకత్వం తరుపున టిడిపి అధ్యక్షులు చంద్రబాబునాయుడు అధికారం చేపట్టారు. అనంతరం శాస్త్రీయ విభజన పేరుతో జిల్లాల విభజనపై మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేశారు. మంత్రివర్గ ఉపసంఘం పలుమార్లు పర్యటించి నివేదికను అందించింది. విభజన అనంతర పరిణామాలను పరిశీలిస్తే పునర్విభజనలో శాస్త్రీయతకే అవకాశం లేదనే వాదన బలంగా వినిపించింది. ఉదాహరణగా వైఎస్.జగన్ హయాంలో రాయచోటిని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేశారు. రాజంపేట వాసులు మాత్రమే విలపిస్తే, కూటమి తరుపున అధికారంలోకి వచ్చిన చంద్రబాబునాయుడు రాయచోటి, రాజంపేట వాసులిద్దరిని విలపింపజేయడాన్ని తీవ్రంగా ఆక్షేపిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. చివరికి ముఖ్యమంత్రి చంద్రబాబు తన కేబినెట్ సహచరుడైన మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సైతం కన్నీటి పర్యంతమయ్యారు. ఒకటి అన్నమయ్య జిల్లా అస్తిత్వం గల్లంతు కావడం, రెండవది జిల్లా కేంద్రం మార్పు అంశాల్లో సహచర మంత్రివర్గ సహచరుడినా, సహచర ప్రజాప్రతినిధులనా, ఓట్లేసి గెలిపించిన ప్రజలనా ఎవరిని సంతృప్తి పరిచినట్లో ఏలికలకే ఎరుక. ఇదిలాఉండగా ఒక రాజకీయం వంతు వచ్చింది. రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి కుటుంబాన్ని చిత్తూరు జిల్లా నుంచి తప్పించి, ముఖ్యమంత్రి చంద్రబాబు రాజకీయంగా తనకు ఎదురు లేకుండా చేసుకున్నారనే వాదన గట్టిగా వినిపిస్తోంది. పెద్దిరెడ్డి అసెంబ్లీ స్థానమైన పుంగనూరును అన్నమయ్య జిల్లాకు తరలించి రాజకీయంగా దెబ్బతీయాలనే ఎత్తుగడ కారణంగానే అశాస్త్రీయమైన, నిరంకుశమైన శమైన విభజన నిర్ణయం తీసుకున్నారనే విమర్శ వినిపిస్తోంది. వైసిపి హయాంలో ఏర్పాటు చేసిన రాయచోటి జిల్లా కేంద్రాన్ని రాజంపేటకు మార్చినా రాజంపేట, రైల్వేకోడూరు వాసులు హర్షించే వారేమో, ప్రస్తుత విభజన కారణంగా రాజంపేట, రాయచోటి నియోజకవర్గాల ప్రజల మనసుల్లో కూటమి పట్ల తీవ్ర వ్యతిరేకతను పాదుగొల్పినట్లు అయిందనే వాదన వినిపిస్తోంది.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

మహిళా రైతుకు పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వరద

రైతులకు పాస్ పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

రాజుపాలెం మండలం కొర్రపాడులో శనివారం రైతులకు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాలను ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం రైతులకు ఇచ్చే పట్టాదారు పాస్ పుస్తకాల మీద జగన్ ఫొటో ముద్రించడం దారుణమన్నారు. చంద్రబాబు నాయకత్వంలో ఇప్పుడున్న కూటమి ప్రభుత్వం రైతులకు రాజముద్రతో పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేస్తోందన్నారు. రాజుపాలెం మండలంలో రూ.13 కోట్ల 30 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. కొర్రపాడు గ్రామంలోనే రూ.1కోటి 50 లక్షలతో పనులు చేశామన్నారు. గ్రామస్తుల వినతి మేరకు శ్మశాన వాటికకు ప్రహరీ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తోట మహేశ్వరరెడ్డి, టీడీపీ రాజుపాలెం మండలం అధ్యక్షుడు కృష్ణారెడ్డి, తహ శీల్దార్ మనోహర్ రెడ్డి, ఎంపీడీఓ రామనాథ రెడ్డి, డిస్ట్రిబ్యూటర్ కమిటీ చైర్మన్ ధనిరెడ్డి రామచంద్రా రెడ్డి, కొర్రపాడు సర్పంచ్ ధనిరెడ్డి శ్రీనివాసుల రెడ్డి, ధనిరెడ్డి సుధాకర్ రెడ్డి, ధనిరెడ్డి దివాకర్ రెడ్డి, జమాల్ రెడ్డి, నారపురెడ్డి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కిట్టయ్య, భాస్కర్ రెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, ధనిరెడ్డి శివ నాగిరెడ్డి, రాజుపాలెం మండల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న తహశీల్దార్, టిడిపి నాయకులు

చాపాడు : మండల పరిధిలోని ఎన్ ఓబాయపల్లె, అయ్యవారిపల్లె గ్రామాల్లో శనివారం పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ రామకుమారి మాట్లాడుతూ రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో రైతులకు ప్రభుత్వ రాజముద్ర కలిగిన పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేస్తుందన్నారు. ఈ పాస్ పుస్తకాల్లో సర్వే నెంబర్లతోపాటు భూమి కొలతలు, పూర్తి డిజిటల్ వివరాలు ఉన్నాయన్నారు. అనంతపురం రెవెన్యూ గ్రామంలో 1,440 పట్టాదారు పాసుపుస్తకాలు, తుమ్మలపాడులో 125 పుస్తకాలు అందజేస్తున్నామన్నారు. రైతులు గతంలో తమ వద్ద ఉన్న పుస్తకాలను అప్పగించి కొత్తవి పొందాలన్నారు. కార్యక్రమంలో డిటి కృష్ణారెడ్డి, ఆర్ఐ శివశంకర్ రెడ్డి, వీఆర్ఓలు శ్రీనివాసుల రెడ్డి, మంజుల, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మునిశేఖర్ రెడ్డి, టిడిపి నాయకులు మల్లిఖార్జున రెడ్డి, రవీంద్ర, వీరారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ క్లినిక్

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

భూ సమస్యల పరిష్కారానికి సంబంధించి సోమవారం రెవెన్యూ క్లినిక్ నిర్వహించనున్నట్లు మైదుకూరు తహశీల్దార్ రాజసింహ నరేంద్ర తెలిపారు. రెవెన్యూ డివిజనల్ అధికారి, కార్యాలయ యంత్రాంగం సమక్షంలో సమావేశం నిర్వహిస్తామన్నారు. భూ సమస్యలకు సంబంధించి తక్షణ పరిష్కారానికి ప్రత్యేకంగా రెవెన్యూ క్లినిక్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. రైతులు సంబంధిత రికార్డులు తీసుకురావాలన్నారు. భూ సమస్యలున్న రైతులు సంబంధిత పత్రాలతో పరిష్కారానికి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ప్రజాసేవే పరమావధిగా పనిచేస్తున్న ఎంపిజె

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రజా సేవే పరమావధిగా ఎంపిజె పనిచేస్తుందని షేక్ వెల్ఫేర్ డెవలప్మెంట్ సొసైటీ చైర్మన్ ముక్తియార్ అన్నారు. పట్టణంలోని హ్యాపీ కల్యాణ మండపంలో ఎంపిజె-2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా ముక్తియార్ మాట్లాడుతూ రాష్ట్రంలో 30 లక్షల షేక్‌లున్నారన్నారు. వారి బాగోగుల గురించి ఎంపిజె ప్రణాళిక రూపొందిస్తే తాను ముఖ్యమంత్రికి నివేదిస్తానన్నారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డు డైరెక్టర్ మాట్లాడుతూ శాంతి, న్యాయం చెప్పే సంస్థ ఎంపిజె అన్నారు. సమాజంలో జరిగే అన్యాయాలపై పోరాటం చేస్తుందన్నారు. ఎంపిజె రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలీం మాట్లాడుతూ ఎంపిజె 12 నెలల క్యాలెండర్ ప్రకారం 12 సూత్రాలను, లక్ష్యాలను ఆమోదించిందని వివరించారు. వీటిలో ప్రజా సంక్షేమమే ప్రధానంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపిజె రాయలసీమ ఇన్‌ఛార్జి అయుబ్ ఖాన్, జిల్లా అధ్యక్షులు జాకీర్ హుస్సేన్, పట్టణ అధ్యక్షుడు హుస్సేన్ బాషా, కార్యదర్శి రఫీ, బేపారి ఆరిఫ్ బాషా పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

ఎస్‌విడిసి ఎన్ఎస్ఎస్ స్వచ్ఛభారత్ స్పెషల్ క్యాంప్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్థానిక శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఊటుకూరు వీరయ్య హైస్కూల్‌లో శనివారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ఆవరణాన్ని శుభ్రం చేశారు. స్కూల్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పర్లపాడు గౌరీ శంకర్ మాట్లాడుతూ పచ్చదనం, పరిశుభ్రత చాలా అవసరమన్నారు. భావితరాలకు ఈరోజు మనం పెంచిన మొక్కలే వృక్షాలై ఫలాని స్తాయన్నారు. మొక్కలు టి, వాటి రక్షణ చూసుకోవడం మన బాధ్యతని వివరించారు. కార్యక్రమంలో అబ్దుల్ సలీం, మునెయ్య ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఆధార్ క్యాంపులు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ఆధార్ కార్డు అప్డేషన్ ప్రత్యేక క్యాంపులను ఈనెల 5 నుంచి 9వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాముడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 5,6న శ్రీస్వామి వివేకానంద ఇంగ్లిష్ మీడియం స్కూల్, శివాలయం వీధిలో, 7 నుంచి 9వతేదీ వరకు శ్రీజి వెంకటప్ప ఇంగ్లిష్ మీడియం స్కూల్, భాకరాపురంలో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

మ్యూజియానికి పూర్వ వైభవం వచ్చేనా..!

ప్రజాశక్తి - మైలవరం

కడప జిల్లాలో పురాతన చరిత్రకు, జమ్మలమడుగు ప్రాంతానికి ఒక ప్రత్యేకత ఉంది. మైలవరంలో జలాశయం నిర్మాణంలో భాగంగా అనేక శిల్పాలు తవ్వకాల్లో లభించాయి. జలాశయ నిర్మాణం పూర్తయిన అనంతరం పురావస్తు ప్రదర్శనశాలను 1976 అక్టోబరు 9న అధికారులు ఏర్పాటు చేశారు. ఆ సమయంలో సేకరించిన పిరంగి గుండ్లు, పురాతన కాలంలో రాజులు వాడిన కత్తులు, కటారులు, పురాతన నాణేలు, దేవత విగ్ర హాలతోపాటు దాదాపు 325 వస్తువులు ఒకచోట చేర్చి నీటిపారుదల శాఖకు సంబంధించిన భవనంలో మ్యూజియం ఏర్పాటు చేశారు. అర్ధ శతాబ్ద కాలా నికి దగ్గరగా ఉన్న మ్యూజియం ప్రస్తుతం శిథిలావస్థకు చేరు కుంది. ఈ కారణంగా పర్యాటకుల సౌకర్యార్థం 2021 జనవరి 31న మ్యూజియంను తాత్కాలికంగా మూసేశారు.

శిథిలావస్థకు చేరుకుని మూతపడిన మైలవరం మ్యూజియం

13 గ్రామాల నుంచి విగ్రహాల సేకరణ

పురావస్తు ప్రదర్శనశాలలో ఉన్న వస్తువులు, రాతి విగ్రహాలు సుమారు 13 గ్రామాల నుంచి సేకరించారు. తొండూరు మండలం మల్లేల ప్రాంతానికి చెందిన రాతి స్తంభాలు సైతం ఇక్కడ ఉన్నాయి. మైలవరం ముంపు గ్రామాలతోపాటు వేపరాల, దొమ్మర నంద్యాల, పెద్దపసుపుల, పెద్దముడియం, మోరగుడి వంటి ప్రాంతాల నుంచి సేకరించిన అరుదైన శిల్పాలు ఇక్కడే భద్రపరిచారు. మ్యూజియం భవనం పాతబడినా అందులోని అరుదైన శిల్పాలను చూసేందుకు పర్యాటకులు ఆసక్తి చూపేవారు. అయితే చాలా విగ్రహాలను మాత్రం ఆరుబయటే ఉంచడంతో అవి పాడయ్యాయి. బయట వాటికి రక్షణ లేకపోవడంతో విగ్రహాలు అసలు స్వరూపాన్ని కోల్పోయాయి. రంగనాథస్వామి, చెన్నకేశవులు, వీరభద్రుడు, శివలింగాలు, ఆంజనేయుడు, వీరగల్లులు, నాట్యమయూరి వంటి రాతి విగ్రహాలు ఆకట్టుకునే రూపంలో ఉన్నాయి. శని, ఆది, సోమవారాల్లో పర్యాటకుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. పండుగ రోజుల్లో మరింత సందడితో మైలవరం జలాశయ ప్రాంగణం కిటకిటలాడుతుంది.

మ్యూజియం తిరిగి పునఃప్రారంభమయ్యేనా..?

శని, ఆది, సోమవారాల్లో అధిక సంఖ్యలో పర్యాటకులు మైలవరం జలాశయం సందర్శించడానికి వస్తుంటారు. మ్యూజియం సందర్శనకు అనుమతుల్లేని కారణంగా పర్యాటకులు నిరుత్సాహంతో వెనుదిరుగుతున్నారు. మ్యూజియం కొత్త భవనానికి చాలా ఏళ్లుగా అడ్డంకులే ఎదురవుతున్నాయి. 14వ ఆర్థికసంఘం కింద రూ.కోటి నిధులు మంజూరయ్యాయి. అప్పుడు స్థలం లేక నిధులు వెనక్కు వెళ్లాయి. అనంతరం మ్యూజియంకు ఎదురుగా ఉన్న 1.39 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం కొత్త మ్యూజియం భవనం నిమిత్తం కేటాయించింది. నిధులు లేక పనులు మొదలు కాలేదు. భావితరాలకు నిజరూప పురాతన చారిత్రాత్మక శిల్ప సంపద, వస్తువులను కాపాడేందుకు ప్రభుత్వం మ్యూజియం కోసం శాశ్విత భవనాన్ని నిర్మించాలని పర్యాటకులు కోరుతున్నారు.

బాలిక, స్త్రీవిద్య ద్వారానే సమాజాభివృద్ధి

యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సావిత్రిబాయి పూలే జయంతి

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు మండలం వనిపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం దేశ మొదటి మహిళా ఉపాధ్యాయురాలు, సంఘసంస్కర్త సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు యూటిఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మేకల గుర్రయ్య మాట్లాడుతూ బాలిక విద్య ద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. ఆ మేరకు సావిత్రిబాయి పూలే సమాజం కోసం చేసిన సేవలను కొనియాడారు. యూటిఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు వై.రవికుమార్ మాట్లాడుతూ సమాజంలో మహిళలపై, బాలికలపై అత్యాచారాలు జరుగుతున్నాయని, కఠిన చట్టాలు తీసుకొచ్చి రక్షణ కల్పిం చాలన్నారు. కార్యక్ర మంలో యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, వనమాల రాము, శీలం పుల్లయ్య, విజయ్‌కుమార్, మున్నీర్ అహ్మద్, మహబూబ్ బాషా, సుధా కర్, గంగాధర్ తిలక్, రమణ, భైరవేశ్వర, హుస్సేన్ పీరా, రమణ, మహిళా ఉపాధ్యాయులు సంజమ్మ, కరిమున్నీసా బేగం, భవాని, ముమ్ తరీన్ పాల్గొన్నారు.

కడప అర్బన్ : జెవివి ఆధ్వర్యంలో.. స్త్రీ విద్యకు మార్గదర్శకురాలు, సామాజిక సంస్కర్త సావిత్రిబాయి పూలే జయంతిని జాతీయ మహిళా దినోత్సవంగా ప్రకటించాలని జెవివి జిల్లా అధ్యక్షులు సమీర్ బాష కోరారు. శనివారం సాయిత్రి బాయి పూలే జయంతి ఉత్సవాలు 11వ బెటాలియన్ జిల్లా పరిషత్ హై స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. హెచ్ఎం పోతు లూరయ్య, సోషల్ సబ్జెక్ట్ ఉపాధ్యాయులు మహమ్మద్ యూనస్, ఉపా ధ్యాయులు మహ మ్మద్ యూనస్, సిరాజుల్లా, నరసింహులు, మాధవి లత, రాజమ్మ, పర మేశ్వరి, సునీత, సుజాత, శ్రీనివాసులు, చంద్ర, హేమంత్, మౌలాలి పాల్గొన్నారు.

కెవిపిఎస్ ఆధ్వర్యంలో.. సావిత్రీబాయి పూలే 195వ జయంతిని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం నగర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సి.పి. రమణ, దాసరి నరసింహులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శనివారం కెవిపిఎస్ జిల్లా కార్యాలయంలో సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిలుగా పెన్షనర్స్ అసోషియేషన్ జిల్లా నాయకులు రామకృష్ణారెడ్డి, నారాయణరెడ్డి, పిఎన్ఎం నగర కన్వీనర్ వరలక్ష్మీ, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు రఘు, డివైఎఫ్ఐ నగర అధ్యక్షులు విజయ్ హాజరయ్యారు. కార్యక్రమంలో కెవిపిఎస్ నగర ఉపాధ్యక్షులు ప్రవీణ్, సహాయ కార్యదర్శి మీనా, గోవింద్, కమిటీ సభ్యులు రామచంద్రయ్య, తిమ్మయ్య, రాజా, శ్రీనివాసులు, సుబ్బారాయుడు పాల్గొన్నారు.

వైవీయూలో.. చరిత్రను చదివే వారే చరిత్రను సృష్టిస్తారు ఆదర్శ మూర్తుల జీవితం గాథలు చదివి భవిష్యత్తు చరిత్ర నిర్మాతలు కావాలని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, రాజనీతి శాస్త్ర విభాగ ఆచార్యులు ఇ. వెంకటేశు ఆకాంక్షించారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఓబిసి సెల్ ఆధ్వర్యంలో శనివారం సావిత్రిబాయి పూలే 195వ జయంతిని నిర్వ హించారు. ముందుగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 'సావిత్రిబాయి పూలే, సామాజిక విముక్తి కోసం సామాజిక క్రియాశీలత' అనే అంశంపై ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. ప్రొఫెసర్ కె.ఎస్.వి. కృష్ణా రావు, డాక్టర్ ఎ.ఎస్.బి. గంగయ్య, ఆచార్య జి.పార్వతి, ఎం. సరళ, డాక్టర్ శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో.. కడప : సావిత్రిబాయి పూలే సేవలు అందరికీ ఆద ర్శం కావాలని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. రమేష్ అన్నారు. శనివారం కడపలోని ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మహిళా సాధికారత విభాగం సహకారంతో మహాత్మ జ్యోతిబాపూలే సతీమణి, భారతదేశపు తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒలు డాక్టర్ అంకాల నాగరాజు, రమేష్ యాదవ్, శివరామకృష్ణ మహిళా సాధికారత విభాగం సభ్యులు సులోచన, సావిత్రి, కృష్ణవేణి, అధ్యాపకులు సుబ్బయ్య, సుందరేశ్వర్, తిలక్‌తో పాటు కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు

బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో.. అణగారిన బిసిల ఆశాజ్యోతి భారతదేశ తొలి మహిళా ఉపా ధ్యాయురాలైన సావిత్రి బాయిపూలే 196వ జయంతి పురస్కరించుకొని స్థానిక బిసి భవ నంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిసి నాయకులు, దేశా నికి సావిత్రి బాయి పూలే చేసిన సేవలు కొనియాడారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులు కాటా వీర మాధవి, కాల బత్తిన సుజాత, షైక్ బీబీ జాన్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బత్తల లింగమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్, గోవింద్ నాగరాజు, గౌరవ అధ్యక్షులు, పత్తురు గురుస్వామి, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ కల్యా సుధాకర్, మహిళా నాయకులు, తొర్రి వేముల జయశ్రీ, జింక జయలక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షులు, ముని రత్నం గౌడ్, ఓబయ, నజీర్ బాషా, పస్తాం అంజి, నరసింహ, సింహాద్రి, నగర అధ్యక్షులు, గొడుగు హరికుమార్, ప్రధాన కార్యదర్శి సురేంద్ర, ప్రచార కార్యదర్శి రాణా ప్రతాప్, కార్యవర్గ సభ్యులు, సుబ్రహ్మణ్యం, సుధాకర్, ప్రశాంత్, సూర్యుడు, బాల సురేష్ హాజరయ్యారు.

బద్వేలు : భారత సామాజిక చరిత్రలో పితృ స్వామిక అంధకారాన్ని చీల్చి, అణగారిన వర్గాలకు విద్యా దీపం వెలిగించిన తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలే నేటి సమాజానికి దార్శనికురాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయకుమార్ పేర్కొన్నారు. సావిత్రిబాయి పూలే 195వ జయంతిని పురస్కరించుకొని శనివారం ఉదయం ఆంధ్ర ప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) ఆధ్వర్యంలో బద్వేల్‌లోని స్థానిక సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కె.సుధాకర్, బద్వేల్ మండల అధ్యక్షులు ఎస్.దేవానందం, సహాధ్యక్షుడు వై.రామయ్య, ట్రెజరర్ ఎ.లాజరయ్య, గోపవరం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.మస్తాన్‌వలి, ఎం. రామచంద్రయ్య, బద్వేలు మండల కార్యదర్శి సి.హెచ్.సాగర్, నాయకులు పి.ఆర్థర్, జి.అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

వేంపల్లె : మహిళా విద్య కోసం భారత దేశ మొదటి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే విశేష కృషి చేసినట్లు డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ నాగేంద్ర పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో శనివారం సావిత్రి బాయి పూలే జయంతిని ఉమెన్ ఎన్‌పవర్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వ హించారు. సావిత్రి బాయి చిత్రపటానికి ఘనంగా నివా ళులర్పించారు. కంప్యూటర్ అధ్యాపకుడు షఫీద్దీన్, పీడీ తేజేంద్ర, రేష్మా పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠం : చదువుల తల్లి సావిత్రిబాయి పూలే నేటి విద్యార్థినులకు, మహిళలకు ఆదర్శమని, ఆమె స్ఫూర్తితో ముందుకెళ్లాలని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు ఎద్దు రాహుల్, మండల అధ్యక్ష, కార్యదర్శులు అరవింద్, రాజశేఖర్, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రెబ్బ నరసింహులు వీరబ్రహ్మేంద్ర జూనియర్ కళాశాల ప్రినిపల్ శేఖర్ పేర్కొన్నారు. సావిత్రిబాయి పూలే చిత్రపటానికి వారు పూలమాల వేసి నివాళులర్పించారు. మహిళా జూనియర్ లెక్చరర్ స్వప్నను సన్మానించారు. సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : భారతదేశపు తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతిని జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఎర్రగుంట్ల జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించారు. హెచ్ఎం అరుణకిరణ్, జెవివి రాష్ట్ర మ్యాజిక్ కన్వీనర్ వి బాలబయన్న, జెవివి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెవి సుబ్బయ్య, ఎం రాంప్రసాద్‌రెడ్డి, తులసి, శశికళ, వెంకట సుబ్బయ్య, రేవతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. పట్టణంలోని దొండపాడు ప్రాథమిక పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంఈఓ శివప్రసాద్ మాట్లాడారు. మహిళ ఉపాధ్యాయులు రాజేశ్వరి, లక్ష్మీ నరసమ్మ, గంగాభవానిని సన్మానించారు. హెచ్ఎం గంగయ్య, ఉపాధ్యాయులు షేక్షావలి పాల్గొన్నారు.

చక్రాయపేట : చక్రాయపేట జడ్‌పి పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. స్త్రీ అభ్యుదయవాది, సంఘ సంస్కర్త సావిత్రి బాయి పూలే జయంతి ఉత్సవాలు జరుపుకోవడం చాలా ఆనందకరమని ప్రధానోపాధ్యాయుడు నాగేంద్రకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా మహిళా టీచర్‌ను సన్మానించారు,

క్రీడాకారులతో ట్రిపుల్ఐటి డైరెక్టర్ కుమారస్వామి గుప్తా

హ్యాండ్‌బాల్‌లో ఇడుపులపాయ జట్టు విజయం

ప్రజాశక్తి - వేంపల్లె

ఆర్జీయూకేటీ ఆర్కేవ్యాలీ క్యాంపస్‌లో ఇంటర్ క్యాంపస్ హ్యాండ్ బాల్, సాఫ్ట్ బాల్ పోటీలను డైరెక్టర్ కుమారస్వామి గుప్తా ప్రారభించారు. శనివారం ఇడుపులపాయ ట్రిపుల్ఐటి క్యాంపస్‌లో జరిగిన ఈపోటీలకు ఆర్జీయూకేటీ పరిధిలోని నాలుగు ట్రిపుల్ఐటిల విద్యార్థులు హాజరయ్యారు. ప్రారంభం మ్యాచ్‌లో ఆర్కేవ్యాలీ, ఒంగోలు ట్రిపుల్ఐటి మధ్య ప్రారంభమైంది. ఒంగోలు జట్టుపై ఇడుపులపాయ జట్టు విజయ కేతనం ఎగుర వేసింది. క్రీడల్లో విద్యార్థులు మంచి ప్రతిభను చూపించారని డైరెక్టర్ తెలిపారు. క్రీడాలతోనే మంచి గుర్తింపు వస్తుందన్నారు. ఇడుపులపాయ క్యాంపస్‌లో టోర్నమెంట్ జరగడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎఒ పెనుకొండ రవి కుమార్, వ్యాయామ అధ్యాపకులు రమణారెడ్డి, బాలయ్య, షంషాద్ బేగం, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రపంచ తెలుగు మహాసభల నిర్వహణ హర్షణీయం

- పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

ఈనెల 3,4,5 తేదీల్లో గుంటూరులో ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించడం హర్షణీయమని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. వేంపల్లెలో శనివారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ తెలుగు భాషను రక్షించాలంటే ఇలాంటి చర్య ఏమాత్రం చాలదన్నారు. తెలుగు భాష శరవేగంగా అంతరించిపోతోందని ఆవేదన వెలిబుచ్చారు. ఇలాగే కొనసాగితే అనతి కాలంలో మధురమైన మన మాతృభాష మృతభాషగా మారిపోయే ప్రమాదం ఉందన్నారు. కొంత కాలం క్రితం వరకు ప్రపంచంలో ఎక్కువ మంది మాట్లాడే భాషల్లో తెలుగుకు 5వ స్థానం ఉండేదన్నారు. అది ప్రస్తుతం 7వ స్థానానికి పడిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. భారతదేశంలో ఎక్కువ మంది మాట్లాడే భాషల్లో హిందీ తర్వాత తెలుగు రెండవ స్థానంలో ఉండగా, ప్రస్తుతం అది నాల్గవ స్థానానికి పడిపోయిందని తెలిపారు. జిఒ 85 రద్దు చేసి ప్రాథమిక విద్యలో తెలుగు మాధ్యమాన్ని తప్పనిసరి చేయాలని ఆయన కోరారు. ఉన్నత విద్యలో, ఉద్యోగాల్లో తెలుగు మాధ్యమంలో చదివిన వారికి 2 శాతం అదనపు మార్కులు కలపాలని తులసి రెడ్డి ప్రభుత్వానికి సూచించారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలోని ప్రముఖ వైద్యుడు డాక్టర్ ఎస్ఎఫ్ బాషా ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2వరకు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఆసుపత్రి సిబ్బంది తెలిపారు. బాషా హాస్పిటల్‌లో ఉచిత శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కడపకు చెందిన ప్రముఖ కంటి వైద్య నిపుణురాలు డాక్టర్ సుఫియా వైద్య సేవలు అందించనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గండి క్షేత్రానికి 15 సీలింగ్ ఫ్యాన్లు వితరణ

ప్రజాశక్తి - చక్రాయపేట

రాయలసీమలో పేరు ప్రఖ్యాతి చెందిన గండి క్షేత్రానికి 15 సీలింగ్ ఫ్యాన్లు విరాళంగా అందజేసినట్లు దేవస్థానం సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన జింకా వెంకటసుబ్బన్న భక్తుల విశ్రాంతి తీసుకొనుటకు అవసరమని గుర్తించి గోల్డ్ మెడల్ కంపెనీ సీలింగ్ ఫ్యాన్లు వితరణ చేశారు. సీలింగ్ ఫ్యాన్స్ వితరణ చేసిన దాత జింక వెంకటసుబ్బన్నకు ప్రధాన అర్చకులు ఆంజనేయస్వామి ప్రత్యేక దర్శనం చేయించి శేష వస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

మాట్లాడుతున్న డిఆర్‌సి వ్యవసాయాధికారి కె.స్వాతి

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు మండలంలోని అన్నలూరు ఆర్ఎస్‌కెలో శనివారం రబీ పంటల సాగులో చేపట్టవలసిన యాజమన్య పద్ధతులపై రైతులకు పూర్వ అభ్యాస గుర్తింపు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి బాలగంగాధర్ రెడ్డి, డిఆర్‌సి వ్యవసాయ అధికారి కె.స్వాతి మాట్లాడుతూ భూసారా పరీక్షలు, సమగ్ర వ్యవసాయం, విత్తన నాణ్యత, విత్తన పరీక్షలు, పురుగు, తెగుళ్ల గురించి వివరించారు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలన్నారు. మట్టి పర్యావరణాన్ని కాలుష్యం నుంచి రక్షించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. రబీ పంటలో తీసుకోవాల్సిన మెళకువలు, పురుగు తెగుళ్ల యాజమాన్య పద్ధతుల వివరించారు. ఇ క్రాప్ తప్పకుండా చేయించుకోవాలని రైతులకు సూచించారు. ఇ-క్రాప్ చేయించుకోవడం వల్ల రైతులకు పలు ప్రభుత్వ పథకాలు అందుతాయని వివరించారు. అధికారుల సూచనలను తప్పక పాటించాలని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ విస్తరణ అధికారులు నరసమ్మ, శశికళ, రైతులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE III ADDITIONAL JUNIOR CIVIL JUDGE : KADAPA

O.S.No.731/2025

Yeddula Tulasi Rami Reddy S/O Yeddula Rama Chandra Reddy, age 48, Hindu and working as Laboratory Programmer, K.S.R.M Engineering college, Y.S.R Kadapa District. Residents of D.No:45/376-2,Balaji Nagar, Kadapa city, Y.S.R Kadapa District. **...Plaintiff**

Vs

Somu Vijay Kumar S/o Somu Mallikarjuna, age 40 years, running Gold shop, D.No.17/5, Somu complex in Y.V Street, Kadapa city, Y.S.R Kadapa District. **...Defendant**

NOTICE TO THE DEFENDANT

Please take notice that the above case filed by the Plaintiff for recovery of amount against you being the Defendant. The above case stands posted to 19.1.2026 at 10.30 am for your appearance before the court. If you fail to appear on that date either in person or through your counsel, the matter will be decided on merits in your absence against you.

M.PAVANI
Advocates, KADAPA.

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT PRODDATUR

O.S.No. 331/2024

Lekkala Srinivasula Reddy, aged about 54 years, Son of Venkata Subba Reddy, cultivation, residing at Somapuram Village, Chapadu Mandal, YSR Kadapa District. **...Plaintiff**

Vs

Modulla Sankaraiah, aged about 62 years, son of Mahadevaiah, Rtd. Govt. Teacher, residing at D.No. 4-368-1, Venkateswarapeta, Proddatur Town & Mandal, YSR Kadapa District. **...Defendant**

రెస్పాండెంట్/ప్రతివాదికి నోటీసు మరియు సమను

ఈ నెంబరు దావాలోని వాది, ప్రతివాది అయిన నీపైన ప్రామిసరి నోటు నిమిత్తం తన బాకీ కోరి రాజశ్రీ పై కోర్టు నందు నీపైన దావ దాఖలు చేసిఉన్నారు. అట్టి దావాతో పాటుగా నీ తాలూకు చెందిన లీవ్ శాలరీని జప్తు కోరి ఐ.ఎ. నెం. 822/2024 గల పిటిషన్ కూడా దాఖలు చేసి ఉన్నాము. అట్టి దావాలోను పిటిషన్లోను ప్రతివాది, రెస్పాండెంట్ అయిన నీకు 21.01. 2026వ తేది నాడు వాయిదా ఉంటు ఉన్నది. అట్టి తేది నాడు ఉదయం గం. 10:30 ని॥లకు రాజశ్రీ పై కోర్టు వారి ఎదుట హాజరై ఏవైన ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకోవలసినది. లేనంతట నీ పరోక్షమందు తీర్మాణించబడును.

వాయిదా తేది: 21.01.2026.

//బై ఆర్డర్ ఆఫ్ ది కోర్టు//
పి.చంద్రశేఖర్
అడ్వకేట్, ప్రొద్దుటూరు.

మహారాజశ్రీ రాయచోటి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

O.S.No. 356/2021

1. సయ్యద్ పర్వాన భర్త లేట్. ఇంతియాజుల్లా, వయస్సు 40సం॥
2. సయ్యద్ హిదయతుల్లా S/o. లేట్ ఇంతియాజుల్లా, వయస్సు 17 సం॥.
3. సయ్యద్ బర్కతుల్లా, S/o. లేట్ ఇంతియాజుల్లా, వయస్సు 8 సం॥

2&3 మైనర్లు గార్డియన్ తల్లి పర్వానా, నివాసం డోర్ నెం.30/40-11, అలీమాబాద్ వీధి, రాయచోటి టౌన్ & మండలం. **...వాదులు**

Vs

డి5.యెస్.సయ్యద్ షాజద్ బేగం తండ్రి లేట్. సయ్యద్ రహం తుల్లా భర్త చాన్ బాష, నివాసం డోర్ నెం.5/208, రవీంద్ర నగర్, కడప టౌన్. **...ప్రతివాది**

నోటీసు ప్రకటన

పై నెంబరు దావాలో వాదులు భాగపరిష్కారమునకు కోరి నీపైన మరియు ఇతర ప్రతివాదులు పైన దావా మరియు ఐ.ఎ.నెం. 911/2021 రు ఇంజక్షన్ ఉత్తర్వులకు దాఖలు చేసి యున్నారు. సదరు దావాలో మీరు 9.2.2026 తేదీన ఉదయం 10.30 గం॥లకు ఖుద్దున గాని వకీలు గారి ద్వారా గాని హాసరై మీ యొక్క ఆక్షేపణలు తెల్పుకోవలయును. లేనంతట పరోక్షంగా తీర్మానింపబడును.

యస్.ప్రభాకర్ రెడ్డి, B.Sc., LL.B.,
యం. ఇలియాస్,
యస్. భరత్ కుమార్ రెడ్డి,
జి.యస్.బి. పవనీష్ రెడ్డి,
వాదిపరం అడ్వకేట్లు రాయచోటి.
సెల్ నెం. 9441570709

డాక్యుమెంట్ పోయినది

నా పేరు వెదురు భాస్కర్ రెడ్డి తండ్రి వెదురు సుబ్బారెడ్డి నేను కామనూరులో మా ఇంటి వద్ద నుంచి ప్రొద్దుటూరు మండలంకు వచ్చే మార్గములో నా స్థలానికి సంబంధించిన లింకు డాక్యుమెంట్ ఒకటి మిస్సయ్యాను డాక్యుమెంట్ నెంబర్ 1235 Of 1988 ఈ నంబర్ గల లింక్ డాక్యుమెంట్ దొరికినచో ఈ క్రింది అడ్రస్‌కు చేర్చగలరు.

వెదురూరు భాస్కర్ రెడ్డి,
సన్నాఫ్ వెదురూరు సుబ్బారెడ్డి 1/73
కామనూర్ కడప ఆంధ్రప్రదేశ్ - 516175.

NAME CHANGE

I **AMBAVARAPU VENKATA SUBBA REDDY**(Old Name), S/o Ambavarapu Subba Reddy, D.No.3/19, Guntikadapalli, Vontimitta Mandal, Kadapa Dt.

I Have been Changed My Name **AMBHAVARAM VENKATA SUBBA REDDY**, S/o Ambhavaram Subba Reddy (New Name).

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE AT PRODDATUR

Creditor IP NO.89/2024

1. Gosula Veera Reddy, aged about 53 years, son of Subba Reddy, Cultivation, residing in D.No. 4/8-2, Dorasanipalle, Proddatur Town, Kadapa District.
2. Vajjala Srinu, aged about 42 years, Son of Subbarayudu, Cultivation, residing at Kanapalli Village, Proddatur Mandal, Kadapa District. **...Petitioners**

Vs

1. Malle Satyavathi, aged about 47 years, wife of late Pullaiah, Housewife, residing at D.No. 26/954-3-7-2, Mittamadi Veedhi, Proddatur Town, Kadapa District.
2. Pulla Subhashini, 30 years, W/o Marthala Maheswara Reddy, House wife, R/at D.No. 26/954-17, Mittamadi Street, beside Ravindra School, Proddatur Town, Kadapa District. **...Respondents 1 and 2**

1 మరియు 2 రెస్పాండెంట్లకు నోటీసు

ఈ నెంబరులోని పిటిషనర్ల వద్ద 1వ రెస్పాండెంట్ బాకీ చేసి ఉన్నారు. అట్టి బాకీని ఎగురగొట్టవలెననే ఉద్ధేశ్యముతో 1వ రెస్పాండెంట్ తాలూకు చెందిన ఆస్తిని 2వ రెస్పాండెంట్‌కు విక్రయించి ఉన్నారు. అట్టి విక్రయ దస్తావేజును రద్దు చేయకోరుచు, రాజశ్రీ పై కోర్టు యందు పిటిషన్ దాఖలు చేసి ఉన్నాము. అట్టి పిటిషన్‌లో 1 మరియు 2 రెస్పాండెంట్లు అయిన మీకు 12.1.2026 నాడు వాయిదా ఉంటుఉన్నది. అట్టి వాయిదా నాడు ఉదయం గం॥10.30 నిమిషములకు రాజశ్రీ పై కోర్టు వారి ఎదుట హాజరై ఏవైనా ఆక్షేపణలు ఉన్న ఎడల తెల్పుకోవలసినది. లేనంతట మీ పరోక్షమందు తీర్మాణించబడును.

వాయిదా తేది: 12.01.2026.

//బై ఆర్డర్ ఆఫ్ ది కోర్టు//
పి.చంద్రశేఖర్
అడ్వకేట్, ప్రొద్దుటూరు.
సెల్: 9866635497.